అట్టహాసంగా అంతర్రాష్ట్ర పశుబల ప్రదర్శన

పోటీలను ప్రారంభిస్తున్న యుగంధర్‌రెడ్డి

అయిజ, ఫిబ్రవరి 23 : తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా రైతులు సంబురాలు జరుపుకోవడం అభినందనీయమని పశుబల ప్రదర్శన బహుమతి దాత యుగంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సేద్య పుట్టెద్దుల విభాగం అంతర్రాష్ట్ర పశుబల ప్రదర్శన పోటీలను అలం పుల్ ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. సేద్య పుట్టెద్దుల విభాగం పోటీలకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పది జతల వృషభరాజములు తరలివచ్చినట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం శనగపల్లికి చెందిన చక్రవర్తిగౌడ్, కర్నూల్ జిల్లా రేమట గ్రామానికి చెందిన నడిపి గిడ్డయ్య కంబైన్డ్ వృషభరాజములు 5,413 అడుగుల దూరంలాగి మొదటి స్థానంలో నిలువగా, కర్నూల్ జిల్లా రేమటకు చెందిన చిన్న గిడ్డయ్య వృషభరాజములు 5,377 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో నిలిచాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్‌కు చెందిన శ్రావణ్ మల్ వృషభరాజములు 5,228 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలువగా, జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పచ్చర్లకు చెందిన సంపత్ కుమార్ వృషభరాజములు 5,163 అడుగుల దూరంలాగి నాలుగో స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గోర్లగుట్లకు చెందిన హేమనాథ్‌రెడ్డి వృషభరాజములు 5,119 అడుగుల దూరంలాగి ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభరాజముల యజమానులకు ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేసింది.

నేటి నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 23 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్న దర్శనానికి సోమవారం నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. వనపర్తి బస్ స్టేషన్ నుంచి ఉదయం 6 గంటల నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులను నడపడం జరుగుతుందని చెప్పారు. వనపర్తి పట్టణ, పరిసర ప్రాంతాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో

ధరూరు, ఫిబ్రవరి 23 : విద్యార్థులకు భోజనం విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా, శుభ్రమైన భోజనం అందించాలని ఎంఈవో రవీంద్ర బాబు అన్నారు. అదివారం మండలంలోని ఉప్పేరు గ్రామంలో ఎస్సీ బాయ్స్ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే స్టోర్ రూమ్‌లోని సరుకులను, నాణ్యతను పరిశీలించి, మెనూ ప్రకారం, క్వాలిటీతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, హాస్టల్ వార్డెన్ సుధీర్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాదశాస్త్రంలో జాతీయస్థాయి ఫెల్లోషిప్‌కు ఎంపిక

వెంకటేశ్

పాన్‌గల్, ఫిబ్రవరి 23 : మండలంలోని తెల్లర్లాకుల్లి తండాకు చెందిన ఇస్లావత్ చిట్టెమ్మ, భాస్కర్‌ల కుమారుడు ఇస్లావత్ వెంకటేశ్ లా సబ్జెక్టులో ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఫెల్లోషిప్‌కు ఎంపికయ్యారు. ఇతను ఉస్మానియా యూనివర్సిటీ న్యాయకళాశాలలో ఐదు సంవత్సరాల ఎల్ ఎల్‌బీ, రెండు సంవత్సరాల ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసుకొని అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసుకుంటూనే దేశవ్యాప్తంగా అనేక మంది అభ్యర్థులు పోటీపడిన ఈ ఫెలోషిప్‌ను గెలుచుకోవడం ద్వారా వెంకటేశ్ విద్యా విశేష ప్రతిభను నిరూపించుకున్నారు. ఈఎంపిక ద్వారా ఐదు సంవత్సరాలపాటు ఫెలోషిప్ అందుతుందని వెంకటేశ్ తెలిపారు.

అన్నదాతలకు సన్మానం

అన్నదాతలకు సన్మానం చేస్తున్న దృశ్యం

వడ్డేపల్లి, ఫిబ్రవరి 23: శ్రీశైల పాదయాత్రికులకు 14సంవత్సరాలుగా జులేకల్ స్టేజీలో అన్నదానం చేస్తున్న దాతలకు ఆదివారం గ్రామస్తులు, భక్తులు సన్మానం చేశారు. ప్రతి సంవత్సరం 6 రోజులపాటు పాద యాత్రికులకు అన్నదానంతోపాటు మెడికల్ కిట్లను అందజేస్తున్న బోయలగూడెం చెందిన దాతలు సత్యనారాయణ శెట్టి, బాబేశ్ శెట్టి, ఓబయ్య శెట్టి, వీరేశ్‌శెట్టిలను సన్మానిం చారు.

రెండు పూరి గుడిసెలు దగ్ధం

అయిజ పట్టణంలో దగ్ధమైన పూరి గుడిసెలు

అయిజ, ఫిబ్రవరి 23 : పట్టణంలోని భరత్‌నగర్ కాలనీలో గాజుల వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల పూరి గుడిసెలు అనుమానాస్పదంగా దగ్ధమ య్యాయి. బాధితులు, కాలనీవాసుల కథనం ప్రకారం.. ఏపీలోని అన్నమయ్య జిల్లా నిమ్మలపల్లి మండలం సోమనపల్లికి చెందిన వెంకటరమణ, వెంకటయ్య కుటుంబాలు పట్టణంలోని తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గాజులు విక్రయించేందుకు వచ్చారు. వారికి భరత్‌నగర్‌లో రెండు పూరి గుడిసెలు ఉన్నాయి. ప్రతియేటా అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి, గద్వాల మండలాల్లో జరిగే బ్రహ్మోత్సవాల్లో గాజుల వ్యాపారం చేసుకుంటూ జీవసనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం జాతరలో గాజులు విక్రయించేందుకు వెళ్లగా, రాత్రి 7గంటల సమయంలో భరత్‌నగర్‌లోని వారి పూరి గుడిసెలు అనుమానాస్పదంగా దగ్ధం కాగా, సమీపంలోని కాలనీవాసులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా లాభం లేక పోయింది. దీంతో గుడిసెల్లో నిల్వ చేసిన రూ.50వేలు విలువ చేసే గాజులు, రూ.10వేల నగదు, నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలి పోయాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికంగా తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని బంగారమ్మగడ్డ కాలనీకి చెందిన నల్ల వోతులు బాలమ్మ (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ మహిళా కమిటీ మండల ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల స్వప్న రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నాయకులు భాస్కర్, ఓంకార్, బాలకృష్ణ, జానకిరాం, రాము ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 23 : గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం 5వ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పోటీ పరీక్షలు నిర్వహించారు. వనపర్తి జిల్లాలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలకు గానూ 4,904 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 143 మంది గైర్హాజరైట్లు తెలిపారు. 97.17 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ఉన్న గురుకుల పాఠశాల, నాగవరం తండా వద్ద ఉన్న అనాస్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణను, విద్యార్థులకు కల్పించిన వసతులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.

గట్టులో..

గట్టు, ఫిబ్రవరి 23 : ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు గురుకులాల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గట్టు గురుకుల పాఠశాల, కళాశాల పరీక్షా కేంద్రంలో 989 మంది విద్యార్థులకు గానూ 972మంది, గట్టులో కొనసాగుతున్న మానవపాడు గురుకుల పరీక్షా కేంద్రంలో 390మందికి గానూ 385 మంది, కస్తూర్బా పరీక్షా కేంద్రంలో 262 మంది విద్యార్థులకు గానూ 258మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఇటిక్యాలలో..

ఇటిక్యాల, ఫిబ్రవరి 23 : గురుకుల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం మండలంలో ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని సాంఘికసంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 829 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 15మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సురేశ్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు తనిఖీ చేశారు.

మదనాపురంలో..

మదనాపురం, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం 5-9వ తరగతి వరకు నిర్వహించిన గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కాగితాల పరమేశ్వర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బలురు 364 మందికి 352 మంది, బాలికలు 269 గానూ 263 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్ష సజావుగా నిర్వహించామని, సహకరించిన పోలీసు సిబ్బందికి, ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వనపర్తిటౌన్ : పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఎర్రవల్లి చౌరస్తాలో..

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 23 : ఎర్రవల్లిలోని గురుకుల పాఠశాల, ఇటిక్యాల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను ఆదివారం అదనపు కలెక్టర్ నర్సింగరావు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి చౌరస్తా : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

గట్టు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారుల సహకారం

అమరచింత, ఫిబ్రవరి 23 : ఆత్మకూర్ పురపాలిక పరిధిలో అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతున్న ఇంటి యాజమానులకు మున్సిపాల్ అధికారులు పరోక్షంగా సహకరం అందిస్తున్నారని సీపీఐ భారత కమ్యూనిస్టు పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు ఆరోపించారు. పురపాలిక పరిధిలోని బాబానగర్‌లో ప్రముఖ వ్యాపారి బంగారు శ్రీనివాసులు కాల నీప్రజలు తిరిగే దుకు ఏర్పాటు చేసిన 20 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి ప్రభుత్వం నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నడని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టగా, వెంటనే అక్రమ నిర్మాణం నిలిపివేయాలని నోటీసులు అందజేసిన మున్సిపల్ అధికారుల ఆదేశాలను బేకాతరు చేసి బంగారు వ్యాపారి శ్రీనివాసులు అదివారం అలాగే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులను కొనసాగిస్తున్నాడు. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు పరోక్షంగా సహకరం అందిస్తున్నరని తెటతెల్లం అవుతుందని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడలా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు వెల్లడించారు. బాబనగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణ పనులపై ఆత్మకూర్ కమిషనర్ శశిధర్‌ను వివారణ కోరగా రోడ్డును ఆక్రమించి బంగారు వ్యాపారి కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నరు ఆ నిర్మాణ పనులను నిలిపివేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆందోళన చేయడంతో నోటీసులు ఇచ్చి పనులు అపించామని, సండే రోజు కూడా తమ వీదుల్లో ఉండలేము కాదా, ఈరోజు పనులు చేస్తున్నరని తెలిసి తమ సిబ్బందిని పంపించామని వారు వెళ్లినప్పుడు పనులు నిలిపివేసి మళ్లి నిర్మాణ పనులు చేస్తే తమ పొద్దస్తామానం కావలి ఉండలేముగా అంటూ కమిషనర్ వివారణ ఇచ్చారు.

అక్రమంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

మౌలిక వసతులు కల్పించాలి

మాట్లాడుతున్న డబుల్ బెడ్రూం కాలనీవాసులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 23 : డబుల్ బెడ్రూం కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం డబుల్ బెడ్రూం కాలనీలో సురేందర్‌బాబు అధ్యక్షన కాలనీవాసుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజపేట, పెద్దగూడెం, అప్పాయిపల్లి డబుల్ బెడ్రూం కాలనీవాసులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కలెక్టర్ డబుల్ బెడ్రూం కాలనీలో నిజమైనా లబ్ధిదారులు నివాసం ఉండడం లేదని, అద్దెలకు ఇచ్చారని, ఇండ్లు అమ్ముకున్నారని, అటువంటి వారిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని చెప్పడం బాధాకరమన్నారు. డబుల్ బెడ్రూం కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తే ప్రజలు వచ్చి నివాసం ఉంటారని, ఎటువంటి సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు తిరిగి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో 11వ బ్లాక్ వరకే మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని, మిగతా బ్లాక్‌లకు నీటి సరఫరా లేదని, ఉన్న మూడు బోర్లలో నీరు తగ్గిందని, దీంతో గొడవలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. సీసీ రోడ్లు మంజూరై ఇప్పటి వరకు ప్రారంభించలేదని, చాలా సమస్యలు ఈ కాలనీలో ఉన్నాయని వారు గుర్తుచేశారు. కలెక్టర్ స్పందించి డబుల్ బెడ్రూం కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజలు డబుల్ బెడ్రూం ఇండ్లలో నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో మండ్ల రాజు, గోపాలకృష్ణ, నిరంజన్, వినోద్, తిరుపతయ్య, ఖాజా, సిద్దయ్య, సుధాకర్‌రెడ్డి, మోహన్, మైను, శ్రీనివాసులు, సలీం, వెంకటేష్, రాధా, అబిద్, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

25న లిటిల్‌స్టార్స్ హైస్కూల్లో సైన్స్ ఫేర్

పాన్‌గల్, ఫిబ్రవరి 23 : మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో ఈనెల 25న సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్‌యాదవ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో దాదాపు 100 ప్రయోగాలతో విద్యార్థులను ఆలోచింపచేసేవిధంగా కళా ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

గాడ్గే బాబాకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

ధరూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని సోంపురం గ్రామంలోని బీఎస్పీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ సృష్టికర్త సంత్ గాడ్గే బాబా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దేవన్న, సభ్యులు అశోక్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువులో బోటు ఏర్పాటుకు అధికారుల పరిశీలన

స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

అమరచింత, ఫిబ్రవరి 23 : ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువులో సందర్శకులు తిరిగుడేందుకు బోటు ఏర్పాటు చేసేందుకు ఆదివారం తెలంగాణ ఎండోమెంట్, టూరిజం శాఖ అధికారులు చెట్లపర మేశ్వర స్వామి చెరువు సమీపంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మొదలు కానున్న చెట్ల పరమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో మత్తడ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విజ్ఞప్తి ఎండోమెంట్, టూరిజం శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో పరమేశ్వర స్వామి చెరువులో బోటును ఏర్పాటు చేసేందుకు కావల్సిన స్థల పరిశీలనకు వచ్చినాట్లుగా అధికారులు తెలిపారు. వారి వెంట ఆలయ నిర్వాహకులు వెంకటన్నలు, దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్స్ అందజేత

విద్యార్థులను అభినందిస్తున్న సినీ హీరో సుమన్ తల్వార్

కొత్తకోట, ఫిబ్రవరి 23 : హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని నారాయణ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ హీరో సుమన్ హాజరయ్యారు. బెల్ట్ గ్రేడింగ్‌లో ప్రతిభ కనపరిచి బ్లాక్‌బెల్ట్ కైవసం చేసుకున్న విద్యార్థులు ఎం. విజయ్‌కుమార్, కె.దుర్గాప్రసాద్ చారి, రాచాల తరుణ్, ఎన్.సాయి, దివేశ్ సత్యసింహలకు సుమన్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్స్ అందించి విద్యార్థులను, కరాటే మాస్టర్ ఇంతియాజ్‌లను ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. కార్యక్రమంలో సదాశివం, సయ్యద్ అశ్వక్, రఫీ ఖాద్రి, వెంకటేశ్, హరీశ్ యాదవ్, జాఫర్ సాదిక్‌లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు విఘాతం

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నర్సింహ

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 23 : కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శి నరసింహ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శ్రీరామ్ అధ్యక్షన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి ఏప్రిల్ ఒకటి నుంచి అమలుకు పూనుకుందన్నారు. పారిశ్రామిక వేత్తలకు కార్మికుల శ్రమను దోచి పెట్టేందుకు కోడ్‌లను తెచ్చిందన్నారు. కోడ్‌లను అమలు చేస్తే కార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతారన్నారు. ప్రస్తుతం కార్మికులు రోజుకి 8 గంటలు పనిచేస్తున్నారని కోడ్ అమలులోకి వస్తే 12 గంటలు పనిచేయాల్సి వస్తుందన్నారు. వందమంది సభ్యులు ఉంటేనే సంఘం ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని, గ్రామాల్లో ప్రతి రంగంలో వందమంది కార్మికులు ఉండరని, లేబర్ కోడ్‌ల అమలును దేశంలోని కార్మిక సంఘాలన్ని వ్యతిరేకిస్తున్నాయన్నారు. బీజేపీకి అనుబంధ కార్మిక సంఘమైన బీఎంఎస్ కూడా రెండు కోడ్‌ల అమలును వ్యతిరేకిస్తుందన్నారు. కార్మికులు ఏఐటీయూసీ కింద సంఘటితమై పోరాడాలన్నారు. మార్చి 29,30 తేదిలలో ఏఐటీయూసీ క్లాస్‌లను వనపర్తిలో నిర్వహించాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ సంఘం జిల్లా మహాసభలను వనపర్తిలో జరపాలన్నారు. ఏఐటీయూసీకి జిల్లాలో చైతన్యవంతమైన బలమైన నాయకత్వం ఉందన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను సమీకరించి కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఇప్పటికే ఉన్న సంఘాల్లో అధికంగా కార్మికులను చేర్చి బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోషే, అధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, సహాయ కార్యదర్శులు శ్యాంసుందర్, లక్ష్మమ్మ, గౌరవాధ్యక్షుడు భరత్, సంఘం సభ్యులు, తదితరులు ఉన్నారు.

అధికారులు ఉన్నట్టా...లేనట్టా..?

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 23 : జిల్లా ప్రధాన రోడ్ల వెంబడి, మహానీయుల విగ్రహాలకు అడ్డుగా, ప్రభుత్వ పథకాల ప్రచారాలకు అడ్డుగా ఇలా ఎక్కడ కూడ ప్లెక్సీలు పెట్టొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు. రోజుకు రోజుకూ పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటు పెరుగుతూనే ఉంది. ఏ చిన్న కార్యక్రమం జరిగిన ఫ్లెక్సీల ఏర్పాటు చేయడం సంస్కృతిగా మారింది. ప్రజలకు ఇబ్బందిగా లేకుండా ఏర్పాటు చేస్తున్నారా అంటే అదిలేదు. నాయకుల అభిమానులు, వ్యాపార స్థులు, రాజకీయ నాయకులు మా ప్రచారమే మాకు ముఖ్యమని ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురి కావాల్సి వస్తుంది.

అనుమతులు తప్పనిసరి

ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే మున్సిపాలిటీ అనుమతులు తప్పనిసరి కాని ఎలాంటి అనుమతులు లేకుండానే తమకు నచ్చిన చోటును ఎంచుకుని ఫ్లెక్సీలు పెట్టేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం చూసిచూడనట్లుగా ఉంటున్నారు. ప్రధాన రహదారులు గుండా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్న వారు కూడా మాకెందుకులే అన్నట్లుగా పోతున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లెక్సీల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నానా అవస్థలు పడుతున్నారు. కరెంటు స్తంభాలకు ఏర్పాటు చేస్తున్న ప్లెక్సీలు ఎప్పుడు తమ వాహనాలపై పడతాయోనని భయం భయంగా ప్రయాణిస్తున్నారు. ఫ్లెక్సీల తొలగింపుపై అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వ్యవహార శైలిపై అసలు అధికారులు ఉన్నట్టా లేనట్టా అంటూ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించి ఏర్పాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.